బద్లాపూర్ రైల్వే స్టేషన్‌లో పట్టాలపై ఆందోళన చేస్తున్న నిరసనకారులు

నర్సరీ పిల్లలపై లైంగిక వేధింపులు

- మహారాష్ట్రలోని ఓ స్కూల్‌లో స్వీపర్ ఘాతుకం
- తల్లిదండ్రులు, స్థానికుల్లో వెల్లువెత్తిన ఆగ్రహం
- పాఠశాల, బద్లాపూర్ రైల్వే స్టేషన్‌పై దాడి
- గంటల తరబడి రైల్ రోకో.. 30 రైళ్లు రద్దు

థాణె/ముంబై, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): నర్సరీ చదువుతున్న ఇద్దరు చిన్నారులపై ఓ కీచకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మహారాష్ట్రలోని థాణే జిల్లా బద్లాపూర్‌లో జరిగిన ఈ ఘటనపై ప్రజల్లో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. నిర్లక్ష్యం వహించిన పాఠశాలతో పాటు, బద్లాపూర్ రైల్వే స్టేషన్‌పై స్థానికులు, తల్లిదండ్రులు దాడి చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గంటల తరబడి రైల్ రోకో నిర్వహించారు. తల్లిదండ్రుల కథనం ప్రకారం.. బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో నర్సరీ చదువుతున్న ఇద్దరు చిన్నారులు(మూడేండ్లు, నాలుగేండ్ల వయస్సు) ఆగస్టు 13న టాయిలెట్‌కు వెళ్లగా, అక్కడే స్వీపర్‌గా పని చేస్తున్న అక్షయ్ షిండే అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆగస్టు 16న వీరిలో ఓ చిన్నారి తనకు ప్రైవేటు భాగాల వద్ద నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు ఏడుస్తూ చెప్పింది. దాంతో ఆరా తీయగా, మరో చిన్నారికి కూడా అలా జరిగిందని తెలియడంతో ఇద్దరు చిన్నారులను స్థానిక దవాఖానకు తీసుకెళ్లగా వారిపై లైంగిక వేధింపులు జరిగాయని వైద్యులు చెప్పారు. దీంతోపోలీసులకు ఫిర్యాదు చేయగా ఆగస్టు 17న నిందితుడు అక్షయ్ షిండేను అరెస్టు చేశారు.

ప్రజల్లో ఆగ్రహజ్వాలలు

చిన్నారులపై లైంగిక వేధింపులకు ఒడిగట్టిన కీచకుడిపై, పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం ఉదయం తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాల వద్ద నిరసన తెలిపారు. కొందరు ఆగ్రహంతో పాఠశాలపై దాడికి పాల్పడి వస్తువులు ధ్వంసం చేశారు. తర్వాత పక్కనే ఉన్న బద్లాపూర్ రైల్వే స్టేషన్‌పైనా రాళ్లు రువ్వారు. స్టేషన్‌లోకి ప్రవేశించి పట్టాలపై కూర్చొని రైల్ రోకో నిర్వహించారు. దీంతో 30 లోకల్ రైళ్లు రద్దయ్యాయి. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన 12 రైళ్లను దారి మళ్లించారు. చాలా రైళ్లు ఆలస్యమయ్యాయి. కేసులో పోలీసుల నిర్లక్ష్యంపై ఆరోపణలు రావడంతో బద్లాపూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎస్సై, హెడ్ కానిస్టేబుల్‌ను వెంటనే సస్పెండ్ చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, క్లాస్ టీచర్‌తో పాటు ఓ మహిళా సహాయకురాలిని విధుల నుంచి తొలగించినట్టు పాఠశాల యాజమాన్యం ప్రకటించింది.

విచారణ జరపనున్న ఎన్‌సీపీసీఆర్, సిట్

బద్లాపూర్ ఘటనపై బాలల హక్కుల రక్షణ జాతీయ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) స్పందించింది. కేసులో పోలీసులు వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని ఎన్‌సీపీసీఆర్ చైర్‌పర్సన్ ప్రియాంక్ కనుంగో తెలిపారు. దీనిపై విచారణ జరిపేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఐజీ స్థాయి అధికారి అర్తి సింగ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను నియమించింది. కేసును ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో విచారణ జరిపించి, న్యాయం జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు. కాగా, ఈ పాఠశాల బీజేపీకి చెందిన వ్యక్తిదని తనకు తెలిసిందని, అయినా రాజకీయాలు చేయదల్చుకోలేదని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని శివసేన(ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు.

ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యమెందుకు?

హత్యాచారం జరిగిన రోజు రాత్రి వరకు ఎందుకు నమోదు చేయలేదు?

- అసలు కాలేజీ ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారు?
- ఆత్మహత్య అని ముందు ఎందుకు చెప్పారు?
- ట్రైనీ డాక్టర్ హత్యాచారంపై పోలీసులు, ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్నల వర్షం
- ఆందోళనలపై అధికారం చెలాయించొద్దు
- శాంతి భద్రతల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- క్షేత్రస్థాయిలో మార్పులకు మరో అత్యాచారం, హత్యనో జరిగే వరకు వేచి చూడొద్దని వ్యాఖ్య
- వైద్య సిబ్బంది భద్రతపై జాతీయ ప్రొటోకాల్ రూపకల్పనకు 10 మంది సభ్యులతో కమిటీ
- వెంటనే విధుల్లో చేరాలని వైద్యులకు సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 20: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా తీసుకొన్న సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, కోల్‌కతా పోలీసులు, ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్‌కు ప్రశ్నల వర్షం కురిపించింది. ట్రైనీ డాక్టర్ హత్యాచారాన్ని భయానక ఘటనగా పేర్కొన్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో అంత ఆలస్యం ఎందుకు జరిగిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. 'పోస్టుమార్టం పూర్తయిన తర్వాత, మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన తర్వాత రాత్రి సమయంలో ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయాల్సి వచ్చింది? కోల్‌కతా పోలీసులు, దవాఖాన అధికారులు అప్పటి వరకు ఏం చేస్తున్నారు? కూతురి మృతదేహాన్ని చూపించేందుకు తల్లిదండ్రులు గంటలపాటు వేచిచూసేలా ఎందుకు చేశారు?' అని ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది.

పోలీసులు ఏం చేస్తున్నారు?

ప్రభుత్వ దవాఖానపై వందల మంది దుండగులు దాడి చేయడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విధ్వంసకారులపై తీసుకొన్న చర్యలపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దవాఖానపై జరిగిన మూకదాడి, ఘటనాస్థలి నుంచి పోలీసులు పారిపోయారన్న ఆరోపణలను న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. క్రైమ్ సీన్ ఉన్న దవాఖానపై దాడి, విధ్వంసం జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించింది. వైద్యులు విధుల్లోకి తిరిగి వెళ్లేలా దవాఖాన వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలను మోహరించాలని ఆదేశించింది. అదేవిధంగా కేసు దర్యాప్తులో పురోగతిపై స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని సీబీఐని ఆదేశించింది.

ఆందోళనలపై సున్నితంగా వ్యవహరించాలి

హత్యాచార ఘటనను నిరసిస్తూ శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న వారిపై అధికారం చెలాయించొద్దని, దేశమంతా ఆందోళన వ్యక్తం చేస్తున్న ఈ తరుణంలో సున్నితంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రభుత్వానికి సూచించింది. 'డాక్టర్లు, పౌర సమాజాన్ని అడ్డుకోవడం సరికాదు. క్రైమ్ సీన్‌ను రక్షించాల్సిన, శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే' అని స్పష్టం చేసింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఈనెల 22కు వాయిదా వేసింది.

ప్రిన్సిపాల్‌కు ప్రశ్నల వర్షం

కేసు విచారణ సందర్భంగా కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ వ్యవహారశైలిని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. కేసును ఆత్మహత్యగా చెప్పేందుకు ప్రయత్నించారని, కుమార్తె మృతదేహాన్ని చూడనీయకుండా బాధిత తల్లిదండ్రులను గంటల పాటు వేచిచూసేలా చేశారని విమర్శించింది. 'ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారు? మొదట ఆత్మహత్యగా చెప్పే ప్రయత్నం చేయడంతో పాటు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఎందుకు నిష్క్రియతో ఉన్నారు? మృతదేహాన్ని కూడా అంత్యక్రియల కోసం ఆమె తల్లిదండ్రులకు రాత్రి సమయంలో అప్పగించారు' అని అసహనం వ్యక్తం చేసింది. ప్రిన్సిపాల్‌పై దర్యాప్తు జరుగుతుండగానే రాజీనామా తర్వాత అయన్ను వెంటనే మరో కాలేజీకి ఎలా నియమిస్తారు? అని ప్రశ్నించింది.

పోలీసులు తగిన చర్యలు తీసుకొన్నారు: సిబల్

కోర్టు పరిశీలనలను పశ్చిమబెంగాల్ ప్రభుత్వ తరపు న్యాయవాది కపిల్ సిబల్ తిరస్కరించారు. కోల్‌కతా పోలీసులు తగిన చర్యలు తీసుకొన్నారని, వాస్తవాలను తాను కోర్టు ముందు ఉంచుతానని వాదించారు. పోలీసులు క్రైమ్ సీన్‌కు చేరుకోకముందే ఫొటోలు, వీడియోలు సర్క్యులేట్ అయ్యాయన్నారు. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు వెంటనే అసహజ మృతిగా రిజిస్టర్ చేశారని వెల్లడించారు. పోలీసులు వెంటనే నిందితుడ్ని అరెస్టు చేశారని తెలిపారు.

ఫొటోలు, వీడియోలు వెంటనే తొలగించండి

బాధిత ట్రైనీ డాక్టర్ పేరు, ఫొటోలు, వీడియోలను అన్ని సోషల్ మీడియా వేదికల నుంచి వెంటనే తొలగించాలని సీజేఐ ధర్మాసనం ఆదేశించింది. లైంగిక దాడి బాధితురాలి గుర్తింపును బయటపెట్టడం నిపున్ సక్సేనా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నది. ఈ మేరకు లాయర్ కిన్నోరి, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ ఆదేశాలు ఇచ్చింది.

మాపై విశ్వాసం ఉంచి.. విధుల్లో చేరండి

'మాపై విశ్వాసం ఉంచి, వెంటనే విధుల్లో చేరండి' అని కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న వైద్యులకు సుప్రీంకోర్టు సూచించింది. సమ్మె విరమించి, విధులకు హాజరు కావాలని కోరింది. వైద్యులు విధులకు దూరంగా ఉండటం వలన ఆరోగ్య రక్షణ అవసరమైన సమాజంపై ప్రభావం పడుతుందని పేర్కొన్నది. వైద్య సిబ్బందికి భద్రత, రక్షణ కల్పించేందుకు తాము ఇక్కడ ఉన్నామని స్పష్టం చేసింది. వైద్య సిబ్బందికి భద్రత కల్పించే అంశంపై కోర్టు జోక్యం చేసుకోవడాన్ని ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ స్వాగతించింది. దేశవ్యాప్తంగా విధులకు దూరంగా ఉన్న వైద్యులను వెంటనే విధులను కొనసాగించాలని కోరుతామని పేర్కొన్నది.

సురక్షిత పని పరిస్థితులు లేకపోవడంపై ఆందోళన

దేశవ్యాప్తంగా ప్రధానంగా ప్రభుత్వ దవాఖానల్లో సురక్షిత పని పరిస్థితులు లేకపోవడంపై బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. పలు చోట్ల వైద్యులపై దాడులు జరుగుతున్న అంశాన్ని ప్రస్తావించిన కోర్టు.. ఇవి వైద్య సిబ్బందికి రక్షణ కల్పించడంలో నిర్మాణాత్మక వైఫల్యానికి ఉదాహరణలు అని పేర్కొన్నది. చాలా మంది యువ వైద్యులు వరుసగా 36 గంటల పాటు పనిచేస్తున్నారని, వారికి డ్యూటీ రూమ్‌లు లేకపోవడాన్ని గుర్తించామని, అదేవిధంగా పురుష, స్త్రీ డాక్టర్లు, నర్సులకు వేర్వేరు రెస్ట్‌రూమ్‌లు లేవని పేర్కొన్నది. ఒక మహిళ తన పని ప్రదేశానికి సురక్షితంగా వెళ్లలేకుంటే, మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్టేనని కోర్టు అభిప్రాయపడింది. క్షేత్రస్థాయిలో మార్పులు జరిగేందుకు మరో అత్యాచారమో లేదా హత్యనో జరిగేంత వరకు వేచి చూడొద్దు అని పేర్కొన్నది. దీని కోసం పని ప్రదేశాల్లో వైద్యులు, ఇతర వైద్య సిబ్బందికి భద్రత కల్పించేందుకు ఒక జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడిన సుప్రీంకోర్టు.. అందుకు సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తి శరన్ నేతృత్వంలో 10 మంది సభ్యులతో కూడిన ఒక నేషనల్ టాస్క్‌ఫోర్స్(ఎన్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసింది. మూడు వారాల్లో మధ్యంతర నివేదిక ఇవ్వాలని సూచించింది.

బాలికలు కోరికలు అణచుకోవాలన్న తీర్పు కొట్టివేత

నిందితుడికి శిక్ష పునరుద్ధరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: కౌమార బాలికలు తమ లైంగిక వాంఛలను నియంత్రించుకోవాలని సూచిస్తూ కలకత్తా హైకోర్టు గత ఏడాది ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసింది. ఆ కేసులో నిందితుడికి విధించిన శిక్షను పునరుద్ధరిస్తున్నట్టు వెల్లడించింది. ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి కింది కోర్టు 20 ఏండ్ల జైలు శిక్ష విధించింది. దీనిపై నిందితుడు దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు... అతన్ని నిర్దోషిగా విడుదల చేస్తూ గత ఏడాది అక్టోబర్ 18న తీర్పు ఇచ్చింది. బాలిక అతడితో ఇష్టపూర్వకంగా సాన్నిహిత్యం కొనసాగించిందన్న కారణంతో నిందితున్ని నిర్దోషిగా ప్రకటించింది.

అంటార్కిటికా పైపైకి

న్యూయార్క్, ఆగస్టు 20: అంటార్కిటికాలో వేగంగా వస్తున్న మార్పులు మిగతా ప్రపంచానికి పెనుముప్పుగా మారబోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భూతాపం కారణంగా ఈ మంచు ఖండంలో మంచు వేగంగా కరిగిపోతున్నది. దీని ఫలితంగా ఈ ఖండం బరువు తగ్గుతున్నదని, క్రమంగా ఇది సముద్రమట్టానికి పైకి వెళ్తున్నదని అమెరికాలోని మసాచుసెట్స్ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు గుర్తించారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా సముద్రమట్టం వేగంగా పెరిగే ముప్పు ఉందని చెప్పారు. భూ తాపం తక్కువగా ఉంటే 2500 నాటికి సముద్రమట్టం 1.7 మీటర్ల మేర పెరుగుతుందని, భూతాపం ఎక్కువగా ఉంటే 19.5 మీటర్ల వరకు కూడా పెరగొచ్చని, సముద్రంలోకి ఎక్కువగా నీరు చేరడం వల్ల ఈ ముప్పు పెరుగుతున్నట్టు తెలిపారు.

అప్పట్లో రోజుకు 26 గంటలు!

బీజింగ్, ఆగస్టు 20: రోజుకు ఎన్ని గంటలు అంటే తక్కున 24 గంటలు అని చిన్న పిల్లలు సైతం చెప్పేస్తారు. కానీ, ఒకప్పుడు ఈ లెక్క వేరేలా ఉండేదట. అవును, కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ఒక రోజుకు 26 గంటలు ఉండేవట. చైనాలోని చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. చంద్రుడి గురుత్వాకర్షణ భూభ్రమణంపై ప్రభావం చూపుతుందని, ఈ శక్తి తగ్గడం వల్ల భూభ్రమణ వేగం రెండు గంటల మేర పెరిగిందని తెలిపారు. 500 మిలియన్ ఏండ్ల నుంచి 650 మిలియన్ ఏండ్ల మధ్య సంభవించిన కేంబ్రియన్ పేలుడు, 280 మిలియన్ సంవత్సరాల నుంచి 340 మిలియన్ సంవత్సరాల మధ్య జరిగిన మరో పేలుడు వల్లనే రోజు నిడివి పెరిగిందని వీరు పేర్కొన్నారు. రోజు నిడివి, భూభ్రమణంపై హిమనీనదాల కంటే అలల ప్రభావమే ఎక్కువ ఉంటున్నదని గుర్తించారు.

ల్యాటరల్ ఎంట్రీపై 'యూటర్న్'

- వ్యతిరేకత రావడంతో కేంద్రం వెనకడుగు
- నియామక ప్రకటన రద్దు చేసిన యూపీఎస్సీ

న్యూఢిల్లీ, ఆగస్టు 20: ల్యాటరల్ ఎంట్రీపై కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గింది. కేంద్రంలోని 45 జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులతో భర్తీ చేయడానికి ఇటీవల ఇచ్చిన ప్రకటనను మంగళవారం యూపీఎస్సీ రద్దు చేసింది. ఈ ప్రకటనను రద్దు చేయాలని అంతకుముందు యూపీఎస్సీ చైర్మన్ ప్రీతి సుదన్‌కు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ లేఖ రాశారు. ఆగస్టు 17న ల్యాటరల్ ఎంట్రీపై యూపీఎస్సీ ప్రకటన జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ పద్ధతిలో నియామకాలు జరపడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్ల హక్కులు దూరమవుతాయనే వివాదం మొదలయ్యింది. ప్రతిపక్షాలతో పాటు ఎన్డీయే పక్షమైన లోక్ జనశక్తి(రామ్ విలాస్) అధ్యక్షుడు, కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ సైతం ల్యాటరల్ ఎంట్రీ ప్రకటనను వ్యతిరేకించారు. తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో కేంద్రం వెనక్కు తగ్గక తప్పలేదు. కాగా, ల్యాటరల్ ఎంట్రీ విధానంలో రిజర్వేషన్ల అమలు అవకాశాలను కేంద్రం పరిశీలించనున్నదని తెలుస్తున్నది.

పీడీఏ ఐక్యతకు తలొగ్గిన కేంద్రం: అఖిలేశ్

'వెనుకబడిన వర్గాలు(పిచ్‌డే), దళితులు, అల్ప సంఖ్యాకుల'(పీడీఏ) ఐక్యతకు కేంద్రం తలొగ్గిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. 'రిజర్వేషన్లను తిరస్కరించి యూపీఎస్సీలో ల్యాటరల్ ఎంట్రీ ద్వారా నియామకాలు చేపట్టాలనుకున్న కుట్ర పీడీఏ ఐక్యత ముందు తలొగ్గింది. ఇప్పుడు బీజేపీ కుట్రలు విజయవంతం కావడం లేదు. పీడీఏలో వచ్చిన అవగాహన, మేలుకొలుపు సాధించిన పెద్ద విజయం ఇది' అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. నియంతృత్వ రాజ్యం పొగరును రాజ్యాంగశక్తి ఓడిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ల్యాటరల్ ఎంట్రీ లాంటి బీజేపీ కుట్రలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ విఫలం చేస్తామని, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్ల వ్యవస్థను కాపాడతామని రాహుల్ గాంధీ అన్నారు. ల్యాటరల్ ఎంట్రీ రద్దుతో తమ ప్రభుత్వం కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పిందని, భవిష్యత్తులోనూ ప్రభుత్వాలు ప్రజల భావోద్వేగాల పట్ల ఇంతే సున్నితత్వాన్ని చూపించాలని కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ పేర్కొన్నారు.

ఎన్డీఏ సర్కారు పీఛేముడ్!

- ఒకసారి నిర్ణయం.. ఆపై వెనక్కు తీసుకోవడం
- మూడో టర్మ్‌లో మారిన ఎన్డీయే సర్కారు తీరు
- మొన్న వక్ఫ్ సవరణ బిల్లు, ప్రసార బిల్లుపై వెనకడుగు
- ఇప్పుడు ల్యాటరల్ ఎంట్రీపైనా ఇదే వైఖరి
- వ్యతిరేకతకు జడుస్తున్న నరేంద్ర మోదీ సర్కారు

న్యూఢిల్లీ, ఆగస్టు 20: గత పదేండ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పట్టుబట్టిన పనులన్నీ పూర్తి చేసింది. సంప్రదింపులు, సమీక్షలు వంటివేమీ లేకుండా చేయాలనుకున్న చట్టాలన్నీ చేసింది. విమర్శలు వచ్చినా, వ్యతిరేకత వ్యక్తమైనా వినిపించుకోలేదు. అయితే, నరేంద్ర మోదీ మూడో పర్యాయం అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మొత్తం మారిపోయింది. కేవలం మూడు నెలల కాలంలోనే నాలుగు విషయాల్లో కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఎన్నికల్లో ఊహించని స్థాయిలో సీట్లు తగ్గిపోయిన ప్రభావమో, మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతుండటం వల్లనో కానీ ఏదైనా నిర్ణయంపై వ్యతిరేకత వస్తే మోదీ ప్రభుత్వం పీఛేముడ్ అంటున్నది.

వరుసగా యూటర్న్‌లు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రసార సేవల(నియంత్రణ) చట్టం చేయాలనుకుంది. ముసాయిదా రూపొందించి స్టేక్‌హోల్డర్లకు పంపించింది. అయితే, ఈ బిల్లు స్వతంత్ర జర్నలిస్టుల గొంతునొక్కేలా ఉందనే విమర్శలు వచ్చాయి. భావప్రకటన స్వేచ్ఛను హరించేలా ఈ బిల్లు ఉందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో కేంద్రం ఈ ముసాయిదా బిల్లును వెనక్కు తీసుకుంటున్నట్టు ప్రకటించింది. తర్వాత వక్ఫ్(సవరణ) బిల్లు విషయంలోనూ ఇలానే జరిగింది. వక్ఫ్ బోర్డు వ్యవస్థలో కీలక మార్పులు చేస్తూ మోదీ ప్రభుత్వం చట్టం చేయాలనుకుంది. అయితే, వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను చేర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అనేక పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. దీంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ ప్యానెల్ పరిశీలనకు ప్రభుత్వం పంపించాల్సి వచ్చింది.

అప్పుడలా.. ఇప్పుడిలా..

స్థిరాస్తుల అమ్మకాలపై వచ్చే లాభాలపై విధించే మూలధన లాభాల పన్నులో ఇండెక్సేషన్ ప్రయోజనం విషయంలోనూ వ్యతిరేకత రావడంతో కేంద్రం వెనక్కు తగ్గింది. ఇండెక్సేషన్ ప్రయోజనం లేని కొత్త విధానం, పాత పన్ను విధానంలో ఏదైనా ఎంచుకునే వెసులుబాటును ప్రజలకు కల్పించింది. ఇప్పుడు ల్యాటరల్ ఎంట్రీ విషయంలోనూ ఇదే జరిగింది. 2018లోనూ ఈ విధానంలో కేంద్రం పలు నియామకాలు చేపట్టింది. అప్పుడు విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. ఇప్పుడు మాత్రం చిరాగ్ పాశ్వాన్ వంటి ఎన్డీఏలోని నేతలే వ్యతిరేకించడంతో వెనక్కు తగ్గక తప్పలేదు.



గెలిస్తే మస్క్‌ను క్యాబినెట్‌లోకి తీసుకొంటా! డొనాల్డ్ ట్రంప్ ఆఫర్.. సిద్ధమేనన్న మస్క్

వాషింగ్టన్, ఆగస్టు 20: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది ఆఖరులో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తాను గెలిస్తే టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌కు క్యాబినెట్ పోస్టు లేదా ప్రభుత్వంలో ముఖ్యమైన సలహాదారుడిగా తీసుకుంటానని ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో పేర్కొన్నారు. దీనిపై వెంటనే స్పందించిన మస్క్ .. 'సేవ చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను' అని ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డీవోజీఈ) అని రాసి ఉన్న పోడియం ముందు నిలబడిన ఫొటోను మస్క్ షేర్ చేశారు. ఇటీవల మస్క్ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్రంప్‌ను ఇంటర్వ్యూ చేశారు. ప్రభుత్వ వ్యయాన్ని పర్యవేక్షించేందుకు 'గవర్నమెంట్ ఎఫిషియెన్సీ కమిషన్' ఏర్పాటును ప్రతిపాదించారు. ఇందుకు ట్రంప్ కూడా సానుకూలంగానే స్పందించారు.

జన్ పోషణ్ కేంద్రాలుగా రేషన్ షాపులు

తెలంగాణ సహా 4 రాష్ట్రాల్లో కేంద్రం పైలట్ ప్రాజెక్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 20: రేషన్ దుకాణాలను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చే పైలట్ ప్రాజెక్ట్‌ను కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్‌లో పైలట్ ప్రాజెక్టు కింద 60 రేషన్ షాపులను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చనున్నట్టు ఆయన చెప్పారు. ఈ ప్రాజెక్ట్ అమలయ్యే షాపుల్లో ఇకపై చిరుధాన్యాలు, పప్పులు, పాల ఉత్పత్తులు, నిత్యావసరాలు అమ్మవచ్చు. అందరూ లాభపడేలా ఈ మార్పు ఉంటుందని కేంద్ర మంత్రి అన్నారు. ప్రస్తుతం ఎఫ్‌పీఎస్ డీలర్లకు ఇస్తున్న కమీషన్ విధానం సరిగా లేదని. .షాపు స్థలాన్ని, పనివారిని సమర్థంగా ఉపయోగించుకొనే ప్రత్యామ్నాయ విధానాలు అవసరమని ఆయన అన్నారు.

దొంగల బడి!

- కోర్సు ఫీజు రూ.2 లక్షల నుంచి 3 లక్షలు
- పాఠ్యాంశాలుగా దోపిడీలు, దొంగతనాలు
- పిల్లల్ని పోటీపడి చేర్పిస్తున్న తల్లిదండ్రులు
- కోర్సు పూర్తయ్యాక, ఏడాదికి రూ.5 లక్షలు చొప్పున ఫ్యామిలీలకు చెల్లిస్తున్న ముఠాలు
- ఎంపీ గ్యాంగ్స్‌తో పోలీసులకు ముచ్చెమటలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): అది మధ్యప్రదేశ్. రాజధాని భోపాల్‌కు 117 కిలోమీటర్ల దూరంలో కడియా, గుల్‌ఖేడీ, హుల్‌ఖేడీ అనే మూడు గ్రామాలు ఉన్నాయి. ఈ పల్లెల్లోని పిల్లలు రాత్రి కాగానే ఓ బడికి వెళ్తారు. 'నైట్ స్కూల్' అనుకొంటే పొరపాటే. ఆ స్కూల్‌లో మంచి బుద్ధులు, సంస్కారం నేర్పించే పాఠాలు బోధించరు. దొంగతనాలు ఎలా చెయ్యాలి? దోపిడీలకు ఎలా పాల్పడాలి? దొంగతనం చేస్తుండగా పట్టుబడితే, ఎదుటివారిపై దాడి చేసి ఎలా తప్పించుకోవాలి? వంటి విషయాలు నేర్పిస్తారు. అదే 'దొంగల బడి'. ఈ స్కూల్‌లో తమ పిల్లలను చేర్పించడానికి ఆయా గ్రామాల్లోని తల్లిదండ్రులు పోటీపడుతున్నారు.

శిక్షణ కోసం లక్షల్లో ఫీజు

దొంగతనాలకు సంబంధించి ఇచ్చే శిక్షణ ఏడాది పాటు ఉంటుంది. ఫీజు రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకూ వసూలు చేస్తారు. కోర్సులో చేరే పిల్లల వయస్సు 12 ఏండ్ల నుంచి 17 ఏండ్ల మధ్య ఉండాలి. పట్టుబడినప్పటికీ, మైనర్లన్న కారణంతో ఎక్కువ శిక్ష పడకూడదనే ఈ వయస్సును నిర్ణయించారు. పిక్‌పాకెటింగ్, విలువైన వస్తువులున్న బ్యాగుల దొంగతనం, దోపిడీలు, పట్టుబడితే కొట్టి వేగంగా పరుగెత్తడం, పోలీసులకు దొరక్కుండా దాక్కోవడం వంటి వాటిల్లో ఈ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తారు.

శిక్షణ పూర్తయ్యాక..

*పిల్లలకు శిక్షణ పూర్తయ్యాక.. శ్రీమంతుల ఇండ్లల్లో జరిగే ఖరీదైన పెండ్లిల్లు, శుభకార్యాలకు పిల్లలను అందంగా ముస్తాబు చేసి ఈ గ్యాంగ్ పంపిస్తుంది. బంగారం, వజ్రాల నగలు, డబ్బును దొంగి